www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 1 నవంబర్ 2025
5
ఏలూరు



9/77 చట్టం కొనసాగించాలని నేడు చర్చా వేదిక

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ఏలూరు అర్బన్ : అసైన్డ్ భూములపై 9/77 చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 1న రాష్ట్రస్థాయి చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అన్నే భవనంలో అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ నిషేధాన్ని ఎత్తివేయడాన్ని వ్యతిరేకిస్తూ, అసైన్డ్ భూములపై 9/77 చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని కోరుతూ చర్చా వేదిక నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని తెలిపారు. చర్చలో పాల్గొనాలని జిల్లాలోని వ్యవసాయ కార్మిక, కార్మిక, రైతు, దళిత సంఘాల నాయకులను ఇప్పటికే ఆహ్వానించామని పేర్కొన్నారు. రాబోయే కాలంలో రాష్ట్ర ప్రభుత్వం దళితులు, పేదలకు అన్యాయం చేస్తూ 9/77 చట్టాన్ని నిర్వీర్యం చేస్తే అడ్డుకోవడం కోసం ఈ చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సిపిఎం నేత చింతకాయల బాబూరావుకు కన్నీటి వీడ్కోలు

కంటతడి పెట్టిన కార్మికవర్గం, మహిళాలోకం

అంతిమయాత్రకు తరలొచ్చిన వందలాది మంది

తుది శ్వాస విడిచే వరకు పోరాటాలే బాబూరావు ఊపిరి

బాబూరావు స్ఫూర్తితో జిల్లాలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమం నిర్మించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పది రోజుల్లో సంస్మరణ సభ

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్





బాబూరావు భౌతికకాయం వద్ద నివాళులర్పించి, సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం/తాడేపల్లిగూడెం

సిపిఎం సీనియర్ నేత చింతకాయల బాబూరావు అంతిమయాత్ర శుక్రవారం తాడేపల్లిగూడెంలో అశ్రునయనాల నడుమ సాగింది. ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు, మహిళలు, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిపిఎం శ్రేణులు, నాయకులు, వామపక్షాల, వివిధ రాజకీయ పార్టీల నేతలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. బాబూరావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని ఘనంగా నివాళులు అర్పించారు. గుండె సంబంధిత చికిత్స నిమిత్తం గురువారం రాజమండ్రి ఆసుపత్రికి వెళ్లిన చింతకాయల బాబూరావు గుండెపోటుతో అక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. రాజమండ్రి నుంచి తాడేపల్లిగూడెం సిపిఎం కార్యాలయానికి భౌతికకాయాన్ని తీసుకొచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. అనంతరం గురువారం రాత్రి తాడేపల్లిగూడెంలోని స్వగృహానికి తరలించారు. శుక్రవారం ఉదయం బాబూరావు భౌతికకాయాన్ని సందర్శించేందుకు వందలాది మంది తరలొచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, జయరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, బాబూరావు భార్య శ్రీదేవి, కుమారుడు సిద్ధార్థ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కాకినాడ జిల్లా అధ్యక్షులు శేషుబాబ్జి, న్యూ డెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి సుధాకర్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఝాన్సీ, డి.కళ్యాణి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేతలు, తాడేపల్లిగూడెం పట్టణ ప్రముఖులు బాబూరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం ఆయన స్వగృహం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర డిఎస్‌చెరువు, శేషమహల్ థియేటర్, మెయిన్ రోడ్డు మీదుగా ఏలూరు రోడ్డులో కొత్త ఫ్లయ్ ఓవర్ వరకూ సాగింది. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, నాయకులు జ్యోతి, జయంతి, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, ఎస్.రంగరావు, జవ్వాది శ్రీను, సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గణేష్, టి.ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్, జిల్లా నాయకులు చింతపల్లి ప్రసాదరావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు షేక్ వలీ, సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, సిపిఎం ఏలూరు జిల్లా నేతలు తెల్లం రామకృష్ణ, గుడిపాటి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

తుదిశ్వాస విడిచే వరకూ పోరాటాలే బాబూరావు ఊపిరి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సాధారణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించిన బాబూరావు తన తుదిశ్వాస విడిచే వరకూ పోరాటాలే ఊపిరిగా పని చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. తాడేపల్లిగూడెంలో ఆయన స్వగృహం వద్ద బాబూరావు భౌతికకాయానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాబూరావు భార్య శ్రీదేవి, కుమారుడు సిద్ధార్థకు ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. సాధారణ కార్మికునిగా బాబూరావు జీవితాన్ని ప్రారంభించారని, అంచెలంచెలుగా ఎదిగి జిల్లాలో ముఖ్యనేతగా, రాష్ట్రస్థాయిలో కార్మిక నేతగా వ్యవహరించిన తీరు అందరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. చివరి శ్వాస వరకు ఉద్యమాలకు అంకితమై పని చేస్తున్నారన్నారు. భార్య శ్రీదేవి, కుటుంబం కూడా ఉపాధ్యాయ, ప్రజా ఉద్యమాల్లో వెన్నంటే ఉన్నారన్నారు. వారికి పార్టీ రాష్ట్ర కమిటీ తరపున సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. కుటుంబానికి బాబూరావు లేని లోటు తీర్చలేనిదని, అయితే కష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్మికులు, రైతులు, ప్రజాసంఘాల కార్యకర్తలు బాబూరావు ఆశయ సాధనకు కృషి చేసి, ఆయన స్ఫూర్తితో జిల్లాలో, తాడేపల్లిగూడెంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.

బాబూరావు మృతి వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు

ఏలూరు అర్బన్: కార్మికోద్యమ నేత చింతకాయల బాబూరావు ఆకస్మిక మృతి జిల్లాలో కార్మికోద్యమానికి, సిపిఎంకు, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం బాబూరావు భౌతికకాయాన్ని ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేశారు. తాడేపల్లిగూడెం నుంచి బాబూరావు భౌతికకాయాన్ని ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల వద్దకు అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. ఆశ్రం వైద్య కళాశాల గేటు వద్ద సిపిఎం, సిపిఐ, వామపక్ష అభిమానులు, సానుభూతిపరులు, వివిధ సంఘాల నేతలు బాబూరావుకు నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి వైద్య కళాశాల లోపలి వరకు ర్యాలీగా నినాదాలు చేస్తూ అనాటమీ డిపార్ట్‌మెంట్ వరకు తీసుకెళ్లారు. అక్కడ నేతల సమక్షంలో భార్య శ్రీదేవి, కుమారుడు సిద్ధార్థ బాబూరావు భౌతికకాయాన్ని కళాశాల అనాటమీ డిపార్ట్‌మెంట్ వారికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎ.రవి అధ్యక్షతన జరిగిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య మాట్లాడుతూ బాబూరావు సిపిఎం నేతగా, కార్మిక నేతగా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రైస్‌మిల్ యూనియన్‌లో కీలక పాత్ర పోషించారన్నారు. బాబూరావు మరణం సిపిఎంకు, వామపక్ష నేతలకు తీరని లోటన్నారు. మరణానంతరం కూడా సమాజానికి ఉపయోగపడేలా, తన భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు ఇవ్వడం సిపిఎం క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. నిరంతరం ప్రజల పక్షాన మాట్లాడిన నేతగా, కార్మిక నేతగా మంచి గుర్తింపు పొందారని తెలిపారు. బాబూరావు మరణ కార్మిక ఉద్యమాలతో పాటు వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. ఎన్‌జిఒ యూనియన్ పూర్వ జిల్లా అధ్యక్షులు ఎల్‌వి.సాగర్ మాట్లాడుతూ చిరకాల మిత్రుడిని కోల్పోయానన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల నాయకులు కర్రి నాగేశ్వరరావు, కేతా గోపాలన్, పివి.ప్రతాప్, డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, జి.రాజు, రాష్ట్ర నాయకులు వై.రాము, ఏలూరు నగర కార్యదర్శి పంపన రవి, నాయకులు ఎం.ఇస్సాక్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, చేతివృత్తిదారుల సంఘం కన్వీనర్ పి.ఆదిశేషు, సిపిఐ నగర నాయకులు హేమశంకర్, మానవత నగర అధ్యక్షులు మేతర అజయ్‌బాబు, సిపిఎం మాజీ కౌన్సిలర్ కంది విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

బాబూరావు మృతి కుటుంబానికే కాకుండా ప్రజా ఉద్యమానికి తీరనిలోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఆసుపత్రికి అని వెళ్లిన బాబూరావు ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. పది రోజుల్లో ఆయన సంస్మరణ సభ ఉంటుందని తెలిపారు. ఆయన జీవిత ప్రస్థానాన్ని తెలుసుకోవాల్సిన అవసరం అందరికీ ఉందన్నారు. కమ్యూనిస్టులు బతికేది ప్రజల కోసమేనని, మరణానంతరం కూడా ప్రజల కోసమే ఉపయోగపడాలనే ముఖ్యోద్దేశంతో బాబూరావు భౌతికకాయాన్ని ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలకు అప్పగించాలని గతంలోనే ఆయన నిర్ణయించుకున్నారని, దానికి కుటుంబం సైతం సమ్మతి తెలిపిందని వివరించారు.



రోదిస్తున్న భార్య, కుమారుడు



అంతిమయాత్రలో మహిళలు, నేతలు



ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వద్ద నేతల నివాళి

రైతు కంట కన్నీరు..!

మొంథా తుపానుతో తీరని నష్టం

రెండు జిల్లాల్లో 40 వేలకుపైగా ఎకరాల్లో వరిపంటకు దెబ్బ

నేలనంటి నీటిలో నానుతున్న వరి పైరు

ఈనిక దశలో ఉన్న పైరు పాలు పోసుకోని పరిస్థితి

రెండు రోజుల్లో పూర్తిస్థాయి పంట నష్టం లెక్కలు పూర్తి

దేవాదాయ భూముల కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఉంగుటూరుకు చెందిన రైతు మిడియాల ప్రసాద్ ఖరీఫ్‌లో ఆరెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశారు. పంట చివరి దశలో మొంథా తుపాను రావడంతో పంట నేలనంటింది. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలు వరకూ పెట్టుబడి పెట్టారు. నేలనంటిన చేలు మాసూలు చేయాలంటే ఎకరాకు అదనంగా మరో రూ.పది వేలకుపైగా ఖర్చవుతుందని లబోదిబోమంటున్నారు'.

'దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన కట్టా కృష్ణ 25 ఎకరాలు కౌలుకు తీసుకుని ఖరీఫ్‌లో సాగు చేశారు. తుపాన్ దెబ్బకు పంట పూర్తిస్థాయిలో దెబ్బతింది. పొలాలు నేలనంటడంతోపాటు ఈనిక దశలో ఉన్న పొలాలు గింజ పాలుపోసుకోకుండా తాలుగా మారిపోతున్న పరిస్థితి ఉంది. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుందని గగ్గోలు పెడుతున్నారు'.

పైన పేర్కొన్న రైతులు ప్రసాద్, కృష్ణలే కాదు. రెండు జిల్లాల్లో వేలాది మంది రైతులు చేతికొచ్చిన పంటను కోల్పోయి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.15 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 1.95 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో దిగుబడి బాగుంటుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మొంథా తుపాను విరుచుకుపడటంతో రెండు జిల్లాల్లోని రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. తుపాను ప్రభావంతో వీచిన గాలులు, వర్షాలకు అత్యధిక పంట నేలనంటి నీటిలో నానుతోంది. ఈ పంటను ఏవిధంగా మాసూలు చేయాలో రైతులకు తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఖర్చులు అదనంగా చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు పది బస్తాలకుపైగా దిగుబడి నష్టం ఉంటుందని రైతులు ఘొల్లుమంటున్నారు. ఈనిక దశలో ఉన్న పొలాలు నిలబడి ఉన్నప్పటికీ కంకులపై పూత రాలిపోవడంతో గింజలు తాలుగా మారిపోతున్నాయి. దిగుబడిపై గణనీయమైన ప్రభావం చూపనుండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. తుపానుకు దెబ్బతిన్న పొలాలను మాసూలు చేయాలంటే సాధారణంగా వెచ్చించే దానికంటే ఎకరాకు మరో రూ.పదివేలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 33 శాతానికిపైగా దెబ్బతిన్న పొలాలను మాత్రమే పంట నష్టపరిహారం జాబితాలో చేరుస్తున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం కలిగే పరిస్థితి నెలకొంది.



ఉంగుటూరు మండలంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంఎల్‌ఎ

రెండు జిల్లాల్లో 40 వేల ఎకరాల్లో పంట నష్టం

తుపాన్ ప్రభావం తగ్గడంతో ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం నుంచి పంట నష్టం లెక్కలను (ఎన్యుమరేషన్) అధికారులు ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 26,537 ఎకరాల్లో పంటనష్టం ఉంటుందని లెక్కలుగట్టారు. తొలిరోజు 4,150 ఎకరాలకు సంబంధించిన పంటనష్టం అంచనాలను నమోదు చేశారు. ఏలూరు జిల్లాలో 15,895 ఎకరాల్లో పంట నష్టం ఉంటుందని లెక్కతేల్చగా తొలిరోజు 3,670 ఎకరాలకు సంబంధించి పంటనష్టం నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. ఆదివారం నాటికి పంటనష్టం నమోదు లెక్కలు పూర్తికానున్నట్లు అధికారులు చెబుతున్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఎకరాకు రూ.పది వేలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వనుంది. వెంటనే ఇస్తారా.. లేక కాలయాపన చేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి.

కౌలు కార్డులు లేని కౌలు రైతుల పరిస్థితి ఏమిటి?

జిల్లాలో చాలా మంది కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వలేదు. పంట దెబ్బతిన్న రైతుల్లో 90 శాతానికిపైగా కౌలురైతులే ఉన్నారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంటనష్టం నమోదు ప్రక్రియ సాగుతోంది. కౌలుకార్డులు లేని కౌలురైతులకు నష్టం ఏవిధంగా ఇస్తారనే ప్రశ్నలకు ఏఒక్కరి వద్ద సమాధానం లేకుండాపోయింది. పైసా పెట్టుబడి పెట్టని భూయజమానుల ఖాతాల్లో పంట నష్ట పరిహారం సొమ్ము జమ చేస్తే తమ పరిస్థితి ఏమిటని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. కౌలు రైతులకు నష్టం పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దేవాదాయ భూములను కౌలుకు తీసుకున్న రైతులు ముందుగా కౌలు చెల్లించారు. ఆ రైతులను ఏవిధంగా ఆదుకుంటారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. లేకపోతే వాస్తవ సాగుదారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

దెబ్బతిన్న పొలాలను పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మొంథా తుపాన్ ప్రభావం వల్ల నేలకొరిగిన, మునిగిన వరి పంట పొలాలను కలెక్టర్ వెట్రిసెల్వి, ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు శుక్రవారం పరిశీలించారు. మండలంలో పంట నీట మునిగి నేలకొరిగిన 2645 (ప్రాథమిక అంచనాల ప్రకారం) ఎకరాల్లో వరి పంటను పరిశీలించారు. తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులందరిని ప్రభుత్వం ఆదుకుంటుందని, నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందిస్తామని, రైతులెవరూ దిగులు చెందవద్దని కలెక్టర్ తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాలు పంట పొలాలను రైతు సేవ కేంద్రం సిబ్బంది నమోదు చేస్తారని తెలిపారు. నాచుగుంట, ఉంగుటూరు, కాగుపాడు, రావులపర్రు, నారాయణపురం గ్రామాల్లో వరి పొలాలను సందర్శించారు. మొంథా తుపాన్ కారణంగా నేలకొరిగిన వరి దుబ్బులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పత్సమట్ల ధర్మరాజు, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీరాణి, జనసేన నాయకులు అయ్యప్ప, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్‌భాషా, ఆర్‌డిఒ అచ్యుత్‌అంబరీష్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఉషా రాజకుమారి, ఉంగుటూరు మండల వ్యవసాయాధికారి డాక్టర్ ఎస్ఎస్.ప్రవీణ్‌కుమార్, తహశీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, ఎంపిడిఒ రాజ్‌మనోజ్ పాల్గొన్నారు.

'మీ డబ్బు-మీ హక్కు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

'మీ డబ్బు-మీ హక్కు' నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు ప్రారంభించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్లో శుక్రవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పోస్టల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేరుపై క్లెయిమ్ చేయని, లేదా మరిచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా పాలసీలు, ఇతర ఆర్థిక సాధనాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా తమ కుటుంబ భవిష్యత్తును సురక్షితం చేసుకుంటున్నారన్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఈ ఆస్తులు లబ్ధిదారులకు చేరకపోవడానికి ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు లేదా నామినీ వివరాల లోపం వంటి కారణాలు ఉన్నాయన్నారు. ఈ ప్రచారం ద్వారా పౌరులు తమ పేరు మీద ఉన్న క్లెయిమ్ చేయని నిధులను గుర్తించి సరైన పత్రాలతో సులభంగా క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పిస్తారని తెలిపారు. నవంబర్ 1న కలెక్టరేట్‌లోని గోదావరి కాన్ఫరెన్స్ హాలు వద్ద ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు లీడ్ బ్యాంకు మేనేజర్‌తోపాటు జిల్లాలోని అన్ని బ్యాంకుల ప్రతినిధులు పాల్గొని అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ నీలాద్రి, స్టేట్‌బ్యాం క్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరా..?

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నిలదీత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలో అనేక సమస్యలు జఠిలంగా మారాయని కౌన్సిల్ సభ్యులు ఎలుగెత్తి చాటిన వైనం తీవ్ర సంచలనంగా మారింది. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు కౌన్సిల్ సభ్యులు అనేక సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ లేని పంపులకు నోటీసులు ఇవ్వడం, రోడ్డు మరమ్మతుల విషయం లెక్క జమా లేనివిధంగా ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. అధికారుల ఆదేశం మేరకు ఆయా శాఖల సిబ్బంది స్పందించడం పట్ల ఆక్షేపణ లేదని, అదే సమయంలో కౌన్సిల్ సభ్యులు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొస్తే ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. ఇదే తీరు కొనసాగితే కౌన్సిల్ సభ్యులుగా ఏ నెలలోనూ సమావేశాన్ని సక్రమంగా జరగనివ్వబోమని ఘాటుగా హెచ్చరించారు. మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో కోతులు, కుక్కల బెడద రోజురోజుకి పెరిగిపోతోందని వాపోయారు. ప్రతి నెలా నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా సకాలంలో స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ ఇదే అంశంపై మాట్లాడుతూ పట్టణంలోని 32 వార్డుల్లో కోతులు, కుక్కల బెడద రాను రాను పెరుగుతున్న మాట వాస్తవమన్నారు. అధికారులు సకాలంలో స్పందించి కోతులు, కుక్కల బెడద నివారించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించి కౌన్సిల్ తీర్మానించింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ప్రసాద్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బండెడు పుస్తకాలు.. కిలోమీటరు నడక

సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థుల పరిస్థితి

సమస్యలతో సతమతం

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు నియోజకవర్గంలోని కొవ్వలి సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులది వింత పరిస్థితి. 50 మంది ఉంటున్న ఈ వసతి గృహం నుంచి రోజూ కిలోమీటర్ దూరంలో ఉన్న పాఠశాలకు బండెడు పుస్తకాలు మోస్తూ నడచి వెళ్లాల్సి వస్తోంది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో విద్యార్థుల నడక ప్రయాణం ప్రమాదకరంగా సాగుతోంది. కొవ్వలి ఏలూరుకు కూతవేటు దూరంలోనే ఉన్నా ఇక్కడి విద్యార్థుల సౌఖ్యం ఎరిగేవారే కరువయ్యారు.



భోజనం చేస్తున్న విద్యార్థులు

400 నుంచి 50కి చేరిన వైనం

దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో నాలుగైదు హాస్టల్స్ కలిపినట్లుండే స్థాయిలో ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ హాస్టల్స్ కాంప్లెక్స్ (సమీకృత్ బాలుర వసతి గృహ సముదాయం) ఏర్పాటు చేశారు. గత ఐదేళ్ల క్రితం వరకు 400 మంది వరకు విద్యార్థులు ఉండేవారు. నిర్వహణ లోపంతో ఇప్పుడు ఆ సంఖ్య 50కి చేరింది. గత ఏప్రిల్ నెల నాటికి వసతి గృహంలో లేని సమస్య లేదంటే నమ్మశక్యం కాదు. అప్పట్లో సిపిఐ అనుబంధ విద్యార్థి సమాఖ్య ఆందోళన చేపట్టడంతో వసతి గృహ అభివృద్ధికి కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ జెడి, ఎఎస్‌బ్ల్యూలు జోక్యం చేసుకుని రూ.12 లక్షలు వెచ్చించి రూపురేఖలు మార్చారు. ఇప్పటికీ కొన్ని సమస్యలు విద్యార్థులను వెంటాడుతూనే ఉన్నాయి.

మరుగుదొడ్లలో గచ్చు రంగుతేలి

వసతి గృహంలోని మరుగుదొడ్లలో వేసిన టైల్స్ రంగుమారి, గార పెట్టి చూడటానికే అసహ్యం కలిగించేలా ఉన్నాయి. వాటిని ఎన్ని కెమికల్స్‌తో కడిగినా ఫలితం లేకుండా పోతోందని అక్కడి వార్డెన్లు వాపోతున్నారు. దీంతో ఇక్కడ పరిసరాలు శుభ్రం చేశారో, లేదో చెప్పలేని పరిస్థితి ఉంది. వసతి గృహం చుట్టూ పొలాలు, గృహాలు ఉన్నాయి. చాలామటుకు ప్రహరీ లేకపోవడంతో పాములు, కీటకాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పిల్లలు ఆడుకోవడానికి తగిన మైదానం కూడా లేదు. పిల్లలు ఉండే గదులు, భోజనశాల, చదువు కునే స్థలం అంత శుభ్రంగానే నిర్వహిస్తున్నా అన్నీ నెలమీదే సాగించాలి. ఆహారం మెనూ ప్రకారమే, బాగానే అందిస్తున్నట్లు పిల్లలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి వ్యవస్థకు స్థానికంగా ఆటంకాలు ఉన్నాయి. దీనిపై అధికారులకు నివేదిక అందజేసినట్లు అక్కడి వసతి గృహ అధికారులు తెలిపారు.



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

మినరల్ వాటర్ ప్లాంట్ లేక

వసతి గృహంలో మినరల్ వాటర్ ప్లాంట్ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు రోజుకు ఐదు నుంచి ఆరు క్యానుల తాగునీరు అవసరం అవుతుంది. ఇందుకోసం ఇక్కడి సిబ్బంది స్థానికంగా ఉన్న వాటర్ ప్లాంట్ నుంచి క్యానుకు పది రూపాయాలు చెల్లించి నీరు తెస్తున్నారు. అదే హాస్టల్‌లోనే ప్లాంట్ ఉంటే అనుకున్న స్థాయిలో నీరు వినియోగుంచుకోవడానికి ఆస్కారం ఉంటుందని వసతి గృహ అధికారులు చెబుతున్నారు. ఇక వసతి గృహంలో డ్రెయినేజీ వ్యవస్థ మరింత మెరుగు కావాల్సి ఉంటుంది. ఇక్కడ ఎడ్యుకేషన్‌కు సంబంధించి వార్డెన్ కొరత ఉంది. ఇక్కడ ఉన్న ఆయన ఇటీవలే బదిలీపై వెళ్లారు. మరొకరిని నియమించాల్సి ఉంది. అలాగే సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వాటర్ ప్లాంట్ ఉంటే బాగుంటుంది

కర్ణుడు, వసతి గృహ అధికారి, కొవ్వలి

వసతి గృహానికి వాటర్ ప్లాంట్ ఉంటే బాగుంటుంది. బయటి నుంచి తెచ్చే నీటి కంటే ప్లాంట్ వాటర్ బెటరని నా అభిప్రాయం. ఇక్కడి పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకుంటున్నాం.

పంట నష్టం నమోదైతే ధాన్యం కొనుగోలు చేయరా

రైతుసంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - దెందులూరు

తుపాను పంట నష్టం కింద నమోదు చేస్తే ఆ భూమికి సంబంధించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయదని నిబంధనలను రూపొందించడం అన్యాయమని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం కొవ్వలిలో తుపాను పంట నష్టాలను రైతుసంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తుపాన్ అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైతునూ ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో పంట నష్టాలను నమోదులో అనేక నిబంధనలు పెట్టడం, రైతులను, కౌలు రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. పంట నష్టాల నమోదు ఎన్యుమరేషన్ నిబంధనలు సడలించాలని కోరారు. దేవాలయ కౌలు రైతు కట్టా కృష్ణ మాట్లాడుతూ దేవాలయ భూములకు ముందే కౌలు చెల్లించామని, తుపాను వల్ల నష్టపోయామని అన్నారు. దేవాలయ భూముల కౌలు రద్దుచేసి, పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కౌలు రైతులు, రైతులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

వరి పొలాలు పరిశీలన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పేరంపట గ్రామంలో తుపాన్ ప్రభావిత వరి పొలాలను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలు నేలమట్టమైన ప్రాంతాలను పరిశీలించిన ఎంఎల్ఎ రైతుల బాధలను తెలుసుకున్నారు. పంట నష్టాలను సకాలంలో అంచనా వేసి తగిన పరిహారం అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, టిడిపి పేరంపేట నాయకులు గోలి రామకృష్ణారెడ్డి, పంచాయతీ ప్రెసిడెంట్ పంపన పాపయ్య, ఎంఎసి డైరెక్టర్ ఇంద్రాణి పద్మ, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలోని పరింపూడి గ్రామంలో ఇటీవల మొంథా తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటలను శుక్రవారం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు కెఆర్.పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పిజి బుజ్జిబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మండలంలో మొత్తం 8200 ఎకరాల వరి సాగు అవ్వగా ఇటీవల వర్షాల కారణంగా 820 ఎకరాల్లో వరి పంట నేలమట్టమైపోయిందని తెలిపారు. 20 ఎకరాల్లో సాగుచేసిన మినుములు పంట కూడా తీవ్రంగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలో వెల్లడించారు. రైతులకు అవసరమైన సహాయ చర్యలు ప్రభుత్వం ద్వారా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కెవిఎన్.పోసరావు, ఎంపిడిఒ కిరణ్‌కుమార్, తహశీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం వచ్చేలా చర్యలు


ప్రజాశక్తి - ముసునూరు

నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖ ఎడిఎ సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని వరి పంట పొలాలను మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. నష్టం వాటిల్లిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ దుర్గాబాయి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

ఎఎంసి ఛైర్మన్‌కు ఎంఎల్ఎ సూచన


ప్రజాశక్తి - చింతలపూడి


ఎంఎల్ఎకు మొక్క అందిస్తున్న పార్వతి

రైతుల సంక్షేమానికి కృషి చేయాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ చీదరాల మధు దుర్గా పార్వతికి సూచించారు. ఆమె ఎఎంసి ఛైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే విధేయులకు తప్పకుండా పదవులు వరిస్తాయన్నారు. ఈ ప్రాంతంలోని రైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెదవేగి ఎంఇఒ-1కు ఎస్‌టియు అభినందన

ప్రజాశక్తి - దెందులూరు


ఎంఇఒను అభినందిస్తున్న ఎస్‌టియు నేతలు

పెదవేగి ఎంఇఒ-1గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఐవివి.ప్రభాకర్‌కు ఎస్‌టియు పెదవేగి మండల శాఖ తరుపున శుక్రవారం అభినందనలు తెలిపారు. ఎస్‌టియు మండలాధ్యక్షులు పరసా నాగార్జున, ప్రధాన కార్యదర్శి తాతపూడి ప్రవీణ్ కుమార్, గౌరవ అధ్యక్షులు నెర్సు శ్రీనివాస్, ప్రభాకర్ గుప్త, అమృత్, షఫీ, విద్యాసాగర్ తదితరులు శుక్రవారం పెదవేగిలోని ఎంఇఒ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు.

ఇందిరాగాంధీ వర్ధంతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

భారతరత్న, మాజీ ప్రధానమంత్రి, ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు ఇందిరాగాంధీ 41వ వర్ధంతిని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశంలో పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రోటీ, కపడా, మకాన్ అనే నినాదంతో పేదలందరికీ తిండి, దుస్తులు, నివాస సౌకర్యం కల్పించే దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని తెలిపారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

ఎంఎల్ఎకు సత్కారం

ప్రజాశక్తి - చింతలపూడి

గతంలో ఏ ఎంఎల్ఎ చేయని విధంగా చింతలపూడిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, మినీ బస్టాండు వాడుకలోకి తీసుకురావడం ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఘనత అని ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర శాసనసభలో షెడ్యూల్డ్ కులాల సంఘం కమిటీ క్రియాశీల సభ్యుడిగా ఎన్నికైన ఎంఎల్ఎను చింతలపూడిలోని ఆయన నివాసంలో వారు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి టౌన్ అధ్యక్షులు తాటి అప్పారావు, జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, చింతలపూడి అర్బన్ హెల్త్ సెంటర్ ఛైర్మన్ సొంగా ఏసుపాదం, ఎఎంసి డైరెక్టర్ చీలపురెడ్డి ఇంద్రాణి, టౌన్ ఎస్‌సి సెల్ కార్యదర్శి కర్లపూడి రాజారత్నం, టౌన్ తెలుగు యువత అధ్యక్షులు నత్త రవి, కొవ్వూరుగూడెం టిడిపి గ్రామ నాయకులు మద్ద ఆనంద్ (పండు), నాయకులు టోకూరి ఏబు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తల్లిని హతమార్చిన కుమారుడికి జీవితఖైదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తల్లిని హతమార్చిన కేసులో కుమారుడికి జీవితఖైదు పడింది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పడమర వీధికి చెందిన డొక్కు హరికృష్ణ మద్యానికి బానిసై గతేడాది మే ఒకటో తేదీన తన తల్లి కృష్ణవేణిని మద్యానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆమె తన వద్ద లేవని అనడంతో పక్కనే ఉన్న కర్రతో ఆమె తలపై కొట్టి ఈడ్చుకుంటూ తీసుకెళ్లి రోడ్డుపై పడేశాడు. ఈ ఘటనలో ఆమె మృతి చెందింది. దీనిపై అప్పటి ఒకటో పట్టణ ఎస్ఐ లక్ష్మణ్‌బాబు కేసు నమోదు చేయగా రాజశేఖర్ కేసును దర్యాప్తు పూర్తి చేశారు. ఈ కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏలూరు ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కలుపుమందు తాగి వ్యక్తి మృతి

కొయ్యలగూడెం : కలుపు మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వేదాంతపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో వేదాంతపురం గ్రామానికి చెందిన నూజేటి రాజు నాలుగేళ్ల నుంచి చెడు వ్యసనాలకు అలవాటై ప్రతిరోజు మద్యం తాగి వచ్చి తన భార్యను, పిల్లలను తిడుతూ, కొడుతూ ఉన్నాడు. దీంతో భార్య రమాదేవి ప్రతిరోజు తాగి డబ్బులు ఇంటిదగ్గర ఇవ్వకుండా పాడు చేస్తున్నావని భర్త రాజును అడగగా శుక్రవారం ఉదయం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో పొలం వెళ్తున్నానని చెప్పి కలుపు మందు తాగిన రాజును కుటుంబసభ్యులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాము కాటుకు మహిళ మృతి

ఏలూరు స్పోర్ట్స్ : పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. వివరాల ప్రకారం... కలిదిండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఎస్.విజయ (32) కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఆమె కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. ఆమెను భర్త వెంటనే ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు.

చింతకాయల బాబూరావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

సిపిఎం నివాళి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

సిపిఎం జిల్లా పూర్వ కార్యదర్శి చింతకాయల బాబూరావు మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బాబూరావు చిత్రపటానికి శుక్రవారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ బాబూరావు మృతి పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బి.శ్రీను, వలీ పాషా, మహబూబ్ పాషా, బాబు, సాయి, తదితరులు పాల్గొన్నారు

నిడమర్రు : నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల


నిడమర్రులో...

కార్యకర్తల ఆధ్వర్యంలో కార్మిక ఉద్యమ నేత చింతకాయల బాబూరావుకు నివాళులర్పించారు. బాబూరావు చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. రమణారావు మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మడమ తిప్పని నాయకుడిగా రాజీలేని పోరాటాలు చేస్తూ ఊపిరి ఉన్నంతకాలం ఎర్రజెండాను వదలకుండా ఆదర్శవాదిగా ఉన్నారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని నినాదాలు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గవర సత్యనారాయణ, సిఐటియు నాయకులు, కానురూ రాజు, లింగుబరి లక్ష్మణరావు, సంకు నాగశ్రీను, రైతు సంఘం నాయకులు వెలగలేటి మోహన, మైలవరపు ప్రసాద్, నాగలక్ష్మి, కోరాడ రమణ పాల్గొన్నారు.

పోలవరం : చింతకాయల బాబూరావు మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ అన్నారు. మండలంలోని కోయ నాగంపాలెం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో చింతకాయల బాబూరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసిన పోరాట యోధుడు చింతకాయల బాబూరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు మడివి చలపతిరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ విద్యార్థులు రక్తదానం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ముదినేపల్లి స్పామ్ ఐటిఐ విద్యార్థులు 50 మంది రక్తదానం చేశారు. కైకలూరులోని సీతారామ కళ్యాణమండపంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా కైకలూరు పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్త దానం చేసిన విద్యార్థులను ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు, పోలీసులు అభినందించారు.

2న నార్వేకు ఏలూరు ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లింగ సమానత్వం, మహిళా సాధికారతపై ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో నార్వే ప్రభుత్వ సహకారంతో ఆదేశ రాజధాని ఓస్లోలో ఈ నెల రెండో తేదీ నుంచి ఎనిమిది వరకు జరిగే సదస్సు, నార్వే ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హాజరవుతున్నారు. ఈ సదస్సుకు భారతదేశం తరపున ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా ఏడుగురు ఎంపీల బృందాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. నాలెడ్జ్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలో భాగంగా జరిగే ఈ పర్యటనలో ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సహా భారత ప్రతినిధి బృందం వారం రోజులపాటు నార్వేలోని ఓస్లో, ట్రోంసో నగరాల్లో పర్యటించనుంది. ఈ పర్యటన కోసం శనివారం రాత్రికి ఎంపీ నార్వే బయలుదేరనున్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి లోపూడి గ్రామంలో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. బాధితునికి టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు ఆర్థిక సాయం అందించారు. వేల్పుల బ్రహ్మయ్య ఇల్లు కూలిపోవడంతో టిడిపి లోపూడి గ్రామ అధ్యక్షులు చలమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రఘుబాబు రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులు వేంపాటి శ్రీనివాసరావు, లక్కపాము కాంతారావు, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమరశీల ఉద్యమాలకు సన్నద్ధమవ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలే కార్మికుల హక్కులన్నీ హరిస్తున్న నేపథ్యంలో కార్మిక చట్టాల రక్షణ కోసం సమరశీల ఉద్యమాలకు సన్నద్ధం కావాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు ఏలూరులో జరిగే రాష్ట్ర రాజకీయ తరగతులు, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాల నిమిత్తం ఏలూరులో శుక్రవారం ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న సౌకర్యాలు, హక్కులు హననం జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, శ్రీనివాసరావు, రమణ, విజయలక్ష్మి నాయుడు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తడిచిన ధాన్యాన్ని కొనాలి

ప్రజాశక్తి - చింతలపూడి

తడిసిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మొంథా తుపాను కారణంగా తడిసిన పొలాలను కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు తక్కిలపాటి ప్రసాదరావు, తాడిగడప మాణిక్యాలరావు, రైతు వడ్లని సుబ్బారావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

చేయూత కార్యక్రమంలో భాగంగా జాతీయ సమైక్యత సందర్భంగా మండలంలోని పెయ్యేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటలు, వక్తృత్వ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు బేతాళ రాజేంద్రప్రసాద్ డ్రాయింగ్ బుక్స్, నోట్ బుక్స్, కాపీ బుక్స్ సహా పాఠ్య ప్రణాళిక కోసం కావాల్సిన కిట్లు విద్యార్థులందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చక్రధర్, ఛైర్మన్ మున్నేశ, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించుకోవడం అత్యంత అవసరమని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర తెలిపారు. స్థానిక విద్యా వికాస్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో, జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్, విద్యావికాస్ విద్యాసంస్థలు సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి. క్లబ్ అధ్యక్షులు దాసరి శేషుకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడిన డిఎస్‌పి రవిచంద్ర, కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అయితే, నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరించారు. వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల్లో కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన లయన్స్ క్లబ్, విద్యావికాస్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. శిబిరంలో 200 మందికి పైగా ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ ఛైర్‌పర్సన్ రత్నకుమారి, జోన్ ఛైర్‌పర్సన్ హనుమంతరావు, జిల్లా క్యాబినెట్ మెంబర్ అట్లూరి సురేష్, మాజీ జోన్ ఛైర్‌పర్సన్లు మద్దిపాటి నాగేశ్వరరావు, పంతగాని వెంకన్న, కొండపల్లి పండు, గోరంట్ల విజయరామరాజు, కాకర్ల వీరభద్రరావు, భవిరిశెట్టి మురళీకృష్ణ, మేడిచర్ల రవి, ఖండవల్లి ఆశీర్వాదం, కొండేపాడి రామకృష్ణ, విద్యావికాస్ విద్యాసంస్థల అధినేత శ్రీనివాసరావు, బసవతారకం కేన్సర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారానికి పి.సత్యవతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది శ్రీకృష్ణమూర్తి సాహిత్య పురస్కారం గుంటూరు జిల్లా కొలకలూరు గ్రామానికి చెందిన సాహిత్యాభిమాని పి.సత్యవతికి ఇవ్వాలని నిర్ణయించినట్లు ఫౌండేషన్ అధినేత మడిపల్లి మోహన్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ గుప్తా మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సహాయం, వైద్య సహాయం వంటి అనేక రంగాల్లో ఫౌండేషన్ సేవలు అందిస్తుందని చెప్పారు. రెడ్‌క్రాస్ సొసైటీలో డయాలసిస్ పేషెంట్ల కోసం రూ.15 లక్షలు విరాళంగా అందించామని తెలిపారు. నగరంలోని వీధి ప్రాంతాల్లో వందలాది నిరుపేద కుటుంబాలకు సహాయ కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద తలసేమియా బ్లాక్ నిర్మాణం కోసం రూ.60 లక్షలు అందించామని, అదనంగా 15 మంది నిరుపేదలకు వ్యక్తిగత ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువుకోసం రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. ద్వారకాతిరుమలలోని ఆసుపత్రిలో వికలాంగుల సహాయార్థం రూ.8.69 లక్షలు విరాళంగా అందించామని తెలిపారు. శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం అవార్డుకు ఎంపికైన పి.సత్యవతికి అవార్డుతో పాటు రూ.మూడు లక్షల నగదు పురస్కారం అందిస్తున్నట్లు తెలిపారు. ఏలూరు మండలంలోని శ్రీపర్రు గ్రామంలో గ్రామస్తుల అవసరాల కోసం కళ్యాణమండపం నిర్మించేందుకు అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

తుపాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి- ముదినేపల్లి

తుపాన్ బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నిత్యావసర సరుకులను టిడిపి నాయకులు శుక్రవారం అందించారు. మండలంలోని వడాలి గ్రామంలో మొంథా తుపాన్ బాధితులకు టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 125 కుటుంబాలను అధికారులు తుపాన్ బాధితులుగా గుర్తించారు. వీరికి ప్రభుత్వం ప్రకటించిన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు నక్క అప్పారావు, కార్యదర్శులు కట్ట కోటయ్య, జోగి వెంకట సుబ్రహ్మణ్యం, బొర్రా సత్యనారాయణ, జెడ్‌పి స్కూల్ ఎస్ఎంసి ఛైర్మన్ గుర్రపు బాబి, విఆర్ఒ పద్మావతి, రేషన్ డీలర్ కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : తుపాన్ బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాసం పొందిన 29 మత్స్యకార కుటుంబాలకు శుక్రవారం 25 కేజీల బియ్యం, నగదు, నిత్యావసరాల సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.సాయిబాబా, కూటమి నాయకులు అడపా నాగరాజు, గండబోయిన శ్రీను, కంపసాటి రమేష్, శివంగుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో శుక్రవారం 15 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారులు నిరంతర రక్తమార్పిడి, మందుల ద్వారా మాత్రమే వారి జీవన ప్రమాణాన్ని మెరుగుపరచుకోవడానికి అవకాశం ఉంటుందని, ఇందుకు ముఖ్యంగా స్వచ్ఛంద రక్తదాతల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. దాతలు ముందుకొచ్చి రక్తమార్పిడి చికిత్సకి ఉపగించే ఫిల్టర్ బ్యాగులకు సహకారం అందించాలని కోరారు. ప్రస్తుతం వారానికి రెండుసార్లు రక్తమార్పిడి చికిత్స నిర్వహిస్తున్నామని, పేషెంట్లకు మరింత మెరుగైన సేవలందించడానికి మూడుసార్లు రక్తమార్పిడి చికిత్స జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రసాద్ తెలిపారు. శుక్రవారం తలసేమియా చిన్నారులు, వారి సహాయకులు 35 మందికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన దాత మానేపల్లి సత్యనారాయణకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు ఎస్.ఆల్బర్ట్, డాక్టర్ యువిఎన్.శాస్త్రి, రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాకపోకలకు తూములు సిద్ధం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక లాల్వా మురుగు కాలువపై వంతెన రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో కలిదిండి నుండి కైకలూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో తూములు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. గతంలో రోడ్డు కొట్టుకుపోయిన ప్రదేశం వదిలి, పాత వంతెనకు మధ్య తూములు వేసి రోడ్డు నిర్మించే పనిలో పడ్డారు. కైకలూరు ఎంఎల్ఎ కె.శ్రీనివాస్, నాయకులు పోకల జోగిరాజు, అంద్రాజు శ్రీనివాసరావు, నున్న రమాదేవి, స్థానిక నాయకులు, నీటి సంఘం అధ్యక్షులు పనులను పర్యవేక్షించారు.

రక్తదానంపై అవగాహన

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక శ్రీ సుగుణ డిగ్రీ కళాశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రక్త దానం చేయడం పట్ల విద్యార్థులు సరైన అవగాహన కలిగి ముందుకు రావాలని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టివి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి.మోహన్‌రావు, పోలీస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజయకుమారికి ఉద్యోగ విరమణ సత్కారం

ప్రజాశక్తి - చింతలపూడి

మల్లెల సరళ విజయ కుమారి 35 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారని చింతలపూడి ఎంఇఒలు కిరణ్‌కుమార్, రామారావు తెలిపారు. ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లెల సరళ విజయకుమారిని ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ కోరారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెరేడ్ గ్రౌండ్ నుంచి రన్ ఫర్ యూనిటీ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై ఫైర్ స్టేషన్‌కు చేరుకుని ఫైర్ స్టేషన్ సర్కిల్లో మానవహారాన్ని ప్రదర్శించారు. అక్కడనుండి తిరిగి ర్యాలీ పెరేడ్ గ్రౌండ్ కు చేరుకుంది. అనంతరం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఏలూరు అర్బన్ : సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రీయ ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు మాట్లాడారు. అనంతరం కళాశాల విద్యార్థులతో రాష్ట్రీయ ఏక్తా దివాస్ ప్రతిజ్ఞ చేయించారు.

కొయ్యలగూడెం : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కొయ్యలగూడెంలో ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏకతా దివాస్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు, పోలీసు సిబ్బంది ఈ రన్‌లో పాల్గొన్నారు.

చింతలపూడి : సమైక్యతకు ప్రతీక సర్దార్ వల్లభాయ్ పటేల్ అని చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా చింతలపూడిలో పోలీస్ శాఖ వారు నిర్వహించే ఐక్యత దివాస్ పురస్కరించుకుని పోలీస్ శాఖ నిర్వహించిన రన్ ఫర్ యూనిటీలిని చింతలపూడి మినీ బస్టాండ్ వద్ద ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ముసునూరు : మండల పరిధిలోని మద్దాయికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడారు.

పోలవరం : దేశ ఐక్యత, సమైక్యత ప్రతీకగా గుర్తింపు పొందిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని పోలవరం ప్రభుత్వ హైస్కూల్‌లో ఏకతా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎల్.సత్యనారాయణ నాయకత్వం వహించారు.

చింతలపూడి : స్థానిక బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం మాటూరి చక్రధరరావు అధ్యక్షతన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు హాజరైన చింతలపూడి సిఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత విశేషాలు గురించి వివరించారు.

నూజివీడు టౌన్ : నూజివీడు సబ్ డివిజన్ పోలీస్ అధికారులు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నూజివీడు పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్వహించారు.

ఆర్‌జియుకెటి నూజివీడు ప్రాంగణంలో సర్దార్ వల్లభ్ భాయి పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమైక్య పాదయాత్ర చేశారు. నూజివీడు డైరెక్టర్ ఆచార్య ఎస్.అమరేంద్ర కుమార్ ముందుగా కె-2 గ్రౌండ్‌లో వాలంటీర్లతో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు.

జీలుగుమిల్లి : జాతీయ ఐక్యత కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఎస్ఐ వి.క్రాంతికుమార్ అన్నారు. జీలుగుమిల్లి ప్రధాన కూడలి నుంచి ఐక్య రన్ నిర్వహించారు.

వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల న్యాయ సేవాధికార సంస్థ నూజివీడు వారి ఆధ్వర్యంలో డిసెంబర్ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నూజివీడు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ తెలిపారు. కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా, ఇరు పార్టీలు హాజరు కావడం ద్వారా రాజీ కుదుర్చుకుని తద్వారా ఖర్చు, సమయం, ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న అన్ని క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు, సందేహాలకు నూజివీడు కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయి ముగ్గురు ఆడ పిల్లలతో బాధలో ఉన్న మహిళకు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని పాకలగూడెం గ్రామానికి చెందిన తెల్లం శ్వేతకు, బుట్టాయగూడెం మండలానికి చెందిన మనోజ్‌కు వివాహమైంది. వారికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందాడు. అప్పటి నుంచి శ్వేత పాకలగూడెం గ్రామానికి వచ్చి ముగ్గురు చిన్నారులతో కలిసి జీవిస్తుంది. అయితే పనులు సరిగ్గా లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండటంతో శుక్రవారం బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయానికి వచ్చి వారి బాధను చెప్పుకున్నారు. సమస్య విన్న ఎంఎల్ఎ వెంటనే చిర్రి ఛారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు. పిల్లల చదువుకు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అందించే పథకాలు వర్తించేలా చూస్తానని తెలిపారు.

బ్లీచింగ్ చల్లించిన సర్పంచి

ప్రజాశక్తి - ముసునూరు

తుపాన్ ప్రభావం వల్ల గ్రామాల్లో మురికినీరు చేరి రోగాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు సర్పంచి పేరం కృష్ణ తెలిపారు. మండలంలోని లోపూడి గ్రామపంచాయతీ పరిధిలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన ఆధ్వర్యంలో బ్లీచింగ్ చల్లించారు. మంచినీటి సదుపాయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అనారోగ్యం బారిన పడకుండా, కలుషిత నీరు తాగకూడదని తెలియజేస్తూ, శుద్ధమైన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బి.నరసింహారావు, పంచాయతీ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.